# ప్రజాసేవ అదృష్టంగా భావించాలి:కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి ప్రజలకు సేవలందించడం అదృష్టంగా భావించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్ శిక్షణ ఇక్కడ పూర్తి చేసుకుని హైదరాబాద్ వెళ్తున్నందున జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఆలిండియా స్థాయిలో ర్యాంకు సాధించిన ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ విభిన్న సంస్కృతి సంప్రదాయాలు, బాషలు కలిగి జిల్లాకు రావడం, ఇక్కడ శిక్షణ పొందడం భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నా కరీంనగర్ జిల్లాను మరవద్దని కలెక్టర్‌ను కోరారు. దిశ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారని అన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలల నిరంతరం పర్యవేక్షిస్తూ వాటి అభివృద్ధికి సహకరించారని తెలిపారు. ఎంచుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసేదాకా వదలని అధికారిగా అజయ్ యాదవ్ నిలుస్తారని తెలిపారు. విలువైన సమాచారం, అవగాహన కల్పించిన జిల్లా అధికారుల సహకారం ఎప్పటికీ మరువలేనని తెలిపారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్‌ను జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ సహా పలువురు అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ ఇతర జిల్లా అధికారులున్నారు.


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 23 మార్చి , 2025 | పేజీలు :08


## కాసిపేట గనుల్లో
# ఐఎన్‌టియుసి సంబరాలు

### సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాపక్షం/ కాసిపేట :మందమర్రి ఏరియాలోని కాసిపేట 1, 2 ఇంక్లైన్ గనుల్లో ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు ఐఎన్‌టియుసి కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మాణం చేయడం, ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా చట్టపరమైన చర్యలు చేపట్టడాన్ని స్వాగతిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు, క్రమశిక్షణ సంఘం చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య మాట్లాడుతూ రాహుల్ గాంధీ జోడో యాత్రలో బిసిల సమస్యలను గుర్తించారని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే బిసి కులగణన చేపట్టి, రిజర్వేషన్లు 23శాతం నుండి 42 శాతం కి పెంచడం చారిత్రక నిర్ణయం అని అన్నారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లును కూడా అసెంబ్లీలో ఆమోదించడం అభినందనీయమని అన్నారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య మాట్లాడుతూ ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి. జనక్ ప్రసాద్ నేతృత్వంలో సింగరేణి పరిరక్షణకు కృషి జరుగుతోందని, కొత్త గనులను తెచ్చేందుకు, ఉద్యోగావకాశాలను పెంచేందుకు ఐఎన్‌టియుసి అహర్నిశలు శ్రమిస్తోందని, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 5,000 బోనస్, వైద్య, బీమా సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు.ఇటీవల ఒక ఉద్యోగి శశికాంత్ మనోవేదనకు గురై ఆసుపత్రిలో చేరిన ఘటన తీవ్రంగా చర్చనీయాంశమైందని, దీనిపై డిప్యూటీ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ కార్యదర్శి పానుగంటి వెంకటస్వామి, ప్రచార కార్యదర్శులు శంకర్ రావు, బన్న లక్ష్మన్ దాస్, ఏరియా నాయకులు సీద్రాల రాజన్న, పిట్ సెక్రటరీ శనిగారపు రవీందర్, సోగాల కన్నయ్య,కాసిపేట 2 ఇంక్లైన్ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ , తదితరులు పాల్గొన్నారు.



# అమ్మకానికి బడి పిల్లల సన్నబియ్యం

### క్వింటాకు రూ. 2600 చొప్పునదొంగ విక్రయం
### అలస్యంగా వెలుగు చూసిన
### 10గోదాం ఇంచార్జ్ నిర్వాకం

ప్రజాపక్షం/ చెన్నూరు :ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యం అధికారులే అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్న ఘటన చెన్నూరులో ఆలస్యంగా వెలుగు చూసింది. శనివారం మధ్యాహ్నం, చెన్నూరు ఎఫ్‌సిఐ గోదాం నుండి తెల్ల సంచుల్లో సన్నబియ్యం తరలిస్తున్న వ్యక్తులను స్థానికులు గమనించారు. వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చి గోదాంలోకి వెళ్లి పరిశీలించగా, మరిన్ని సంచులు తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయని గుర్తించారు. గోదాం ఇంచార్జి సంతోష్‌ను నిలదీయగా, పొంతన లేని సమాధానాలు ఇచ్చి, తాళం వేసి అక్కడి నుండి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. గత కొద్దిరోజులుగా లక్షల రూపాయల విలువైన సన్నబియ్యాన్ని, ప్రతి క్వింటాను 2600 చొప్పున అమ్ముకుంటూ గోదాం ఇంచార్జి అక్రమ దందా నిర్వహిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేద విద్యార్థులకు అందాల్సిన బియ్యాన్ని అధికారులు దొంగదారి పట్టించడం అత్యంత దారుణమని, ఇలాంటి వ్యక్తులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ స్పందిస్తూ, నిరుపేద విద్యార్థులకు అందాల్సిన బియ్యం అమ్మకాన్ని ఉపేక్షించేది లేదని, తద్వారా బాధ్యులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాసుల కోసం పేద విద్యార్థుల కడుపు కొడతారా?.. సిపిఐ నేత మధునయ్య ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చాలకపోయినట్లుగా, విద్యార్థులకు అందాల్సిన బియ్యాన్ని అమ్ముకోవడం సిగ్గుచేటు అని సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు మధునయ్య మండిపడ్డారు. బడి పిల్లలకు పౌష్టికాహారం అందించాల్సిన బియ్యాన్ని కూడా వదలని అధికారులు, రేషన్ కార్డు ద్వారా అందనున్న సన్నబియ్యాన్ని సైతం దోచుకునే ప్రమాదం ఉందని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, బియ్యం దొంగలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.







# రైతుల కష్టం
## కురిసిన అకాల వర్షం..
## మట్టిలో కలిసిన

### జిల్లాలో వర్ష బీభత్సం..
### వడగండ్లతో పంటలకు తీవ్ర నష్టం

ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :మంచిర్యాల జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు విరిగి రహదారులపై పడగా, వ్యవసాయ పొలాల్లోని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని హాజీపూర్, దండేపల్లి, కర్ణమామిడి, నర్సింగాపూర్, ధర్మారం, బుగ్గగట్టు గ్రామాల్లో మామిడి, వరి, మొక్కజొన్న తోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి.

**రైతుల ఆశలపై నీళ్లు చల్లిన అకాల వర్షం..**

వేసవి వేడి మండిపోతున్న వేళ ఆకస్మికంగా కురిసిన అకాల వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. హాజీపూర్ మండలంలోని సబ్బేపల్లి, రాపల్లి, ధర్మారం, బుగ్గగట్టు గ్రామాల్లో మామిడి తోటలకు భారీగా నష్టం వాటిల్లింది. ఇప్పటికే తేనెమంచుతో పూత వాడిపోవడంతో తక్కువ దిగుబడికి గురైన మామిడి రైతులకు ఈ వడగండ్ల వాన మరింత నష్టాన్ని తెచ్చిపెట్టింది. కాసిన మామిడి కాయలు వడగండ్ల వానకు రాలిపోవడంతో రైతులు కంట తడి పెడుతున్నారు. మరో 20 రోజుల్లో పంట కోయాలని భావించిన రైతులకు అకాల గాలిదుమారం భారీ ఎదురు దెబ్బ అని రైతులు వాపోతున్నారు.

**వరి, మొక్కజొన్న రైతుల పరిస్థితి దయనీయం**

హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి గ్రామంలో కోటె పోచయ్య అనే రైతు రెండు ఎకరాల్లో సాగుచేసిన వరి పూర్తిగా నష్టపోయింది. జునగరి కోటయ్య, కొట్టే నర్సయ్యల 8 ఎకరాల వరి నేలమట్టమైం ది. నర్సింగపూర్, ధర్మారం గ్రామాల్లో మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బ తింది. జన్నారం మండలం మోర్రిగూడా గ్రామంలో మొక్కజొన్న పంట నేలకొరిగింది. సింగరాయిపేట్, తిమ్మాపూర్, రాంపూర్, కవ్వాల్, కిష్టాపూర్, కలమడుగు గ్రామాల్లోనూ వడగండ్ల వర్షానికి పంటలు నాశనమయ్యాయి. భారీ గాలులతో మొక్కజొన్న పూర్తిగా నేలకూలడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దండేపల్లి మండలంలో ఐదు ఎకరాల మేర మొక్కజొన్న తోట నాశనమైంది. మొత్తం మీద వరి, మొక్కజొన్న, మామిడి తోటలకు భారీ నష్టం వాటిల్లింది. పొట్ట దశకు చేరుకున్న వరి గింజలు వర్షానికి రాలిపోవడంతో రైతులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

**ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇవ్వాలి.. రైతులు**

హాజీపూర్ మండల వ్యాప్తంగా 80 ఎకరాల వరి, 50 ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా నష్టపోయిందని రైతులు చెబుతున్నారు. హాజీపూర్, దండేపల్లి మండలాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో కూడా రైతులు భారీ నష్టాన్ని చవి చూశారు. ప్రభుత్వమే ముందుకు వచ్చి పంట నష్టం అంచనా వేసి తక్షణ సహాయాన్ని అందించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని, తక్షణ సాయం ప్రకటించాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సహాయ చర్యలు తీసుకోకపోతే తీవ్ర ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరిస్తున్నారు. పంట నష్టాన్ని పరిశీలించేందుకు గ్రామంలో వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టారు.



# రైతులను దెబ్బతీసిన అకాల వర్షం

ప్రజాపక్షం/గొల్లపల్లి : ఒకవైపు ఎండలు ముదిరి భూగర్భ జలాలు ఎండిపోవడంతో పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్న రైతులను శుక్రవారం కురిసిన అకాలవర్షం దెబ్బతీసింది.అకస్మాత్తుగా వడగండ్లు ,ఈదురు గాలులు ,ఉరుములతో కూడిన వర్షం రావడంతో చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయి .ఈదురు గాలులకు మొక్కజొన్న ,పసుపు పంటలను ఆరబెట్టిన రైతులు ఇబ్బంది పడ్డారు .మామిడి పూత ,కాత రాలింది. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉన్నట్టుండి వర్షం కురవడంతో ఉక్కపోతతో తల్లడిల్లుతున్న వారికి ఊరటనిచ్చింది .కానీ పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు .ఉరుములు ,మెరుపులు ఈదురు గాలులతో కొన్ని ప్రాంతాల్లో రాళ్ల వర్షం కురిసింది .మండలంలో కొన్ని ప్రాంతాల్లో వరి పంట పొట్టకు వచ్చి ఉండడం మరి కొన్ని ప్రాంతాల్లో ఇరవై రోజుల్లో కోతకు సిద్ధంగా ఉంది .దాంతో అకాల వర్షం వల్ల దెబ్బతినే



ప్రమాదం ఉందని రైతులు ఆందోళన పడుతున్నారు.అకాల వర్షానికి కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది .చలి తీవ్రత వల్ల మామిడి పూత సరిగా లేకపోవడంతో రైతులు ఇప్పటికే ఆందోళన చెందుతున్నారు .దానికి తోడుగా అకాల వర్షానికి కాసిన కాయలు నేలరాలాయి . వచ్చే రెండు రోజులు కూడా ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నా రు.

# అకాల వర్షం మొక్కజొన్న రైత్తన్నలు ఆగం

### పరిశీలించిన మండల వ్యవసాయ, రెవెన్యూ అధికారులు



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల మండలంలో శుక్రవారం కురిసిన అకాల వర్షం వల్ల జగిత్యాల మండలంలో లక్ష్మీ పూర్ గ్రామంలో నష్టపోయిన మొక్కజొన్న పంటను జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, మండల రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో రైతులతో కలిసి నష్టపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించడం జరిగిందని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ జగిత్యాల మండలంలో 514 మంది రైతుల వేసిన 735 ఎకరాల మొక్కజొన్న పంట నష్టపోయినట్టు అంచనా వేశామని, నష్టపోయిన రైతులకు సంబంధించిన పంట వివరాలు సేకరించి ఉన్నతస్థాయి అధికారులకు నివేదిస్తామని, జగిత్యాల మండలంలో వరి, నువ్వుల పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని, కేవలం మొక్కజొన్న పంటకు మాత్రమే నష్టం వాటిల్లిందని జగిత్యాల జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. వారి వెంట జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్, జగిత్యాల మండల వ్యవసాయ అధికారి తిరుపతి నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి హరీష్, లక్ష్మీ పూర్ గ్రామ రైతులు పన్నాల తిరుపతి రెడ్డి, రాజి రెడ్డి, నత్తి రెడ్డి, తదితరులు ఉన్నారు.

# నోటితో ప్రజాపాలన..నొసలితో నిర్బంధ పాలన

### సిఐటియు ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:ఇచ్చిన హామీలను అమలు చేసి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద వివిధ రంగాల కార్మికులు నిరసన చేసే క్రమంలో వారిని అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటు అని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ ఖండించారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? ప్రజాపాలననా? ప్రజలను నిర్బంధించే పాలనా అని మండి పడ్డారు. శనివారం జిల్లా వ్యాప్తంగా వివిధ చోట్ల సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో గంజి కేంద్రంలో కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్ల రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధర్నాకు అనుమతినిచ్చి సిఐటియు నాయకులను, అసంఘటిత కార్మికులను ఇంటి వద్ద అక్రమ అరెస్టులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వం ధర్నా చౌక్‌ను ఎత్తివేస్తే ఈ ప్రభుత్వం ధర్నాలకు అనుమతులిచ్చి అక్రమ అరెస్టులు చేస్తోందన్నారు. కార్మికుల హక్కులను, ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ప్రజా సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. నోటితో ప్రజాపాలన నొసలితో నిర్బంధ పాలన అనే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో అసంఘటిత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ఎండగట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు రాజయ్య, పరశురాములు, చుక్క కుమార్, రాజు, భిక్షపతి, సంపత్, సదానందం, లక్ష్మణ్, తదితరులున్నారు.

# కాంగ్రెస్ లీగల్ సెల్‌ను బలోపేతం చేయాలి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో శనివారం ఓ ప్రైవేట్ హాలులో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ కల్లెపల్లి లక్ష్మయ్య ఆధ్వర్యంలో లీగల్ సెల్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కోర్టుల్లో ఖాళీ అవుతున్న, కాబోతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల విషయంలో అర్హత కలిగిన కాంగ్రెస్ లీగల్ సెల్ కార్యకర్తలను పరిగణలోకి తీసుకుని సంబంధిత మంత్రులతో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ న్యాయవాదులు లుక్క రాజేశం, నరసింహారెడ్డి, శంకరయ్య, రాచకొండ ప్రభాకర్, ప్రతాప్, బాలకిషన్‌రావులు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ లీగల్ సెల్‌ను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అదే



విధంగా ఏప్రిల్‌లో జరగబోయే కరీంనగర్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో లీగల్ సెల్ నుంచి నిలబడే వ్యక్తులను గెలిపించే బాధ్యతను తీసుకోవాలని ఐదుగురితో కమిటీ వేశారు. కమిటీలో లుక్క రాజేశం, పెంచాల లక్ష్మణ్‌రావు, ఆర్.దేవేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, రాచకొండ ప్రభాకర్ సభ్యులుగా కొనసాగుతారని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బాధ్యులు, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేషన్ సంబరాలు



ప్రజాపక్షం/మంథని :మంథని మండలం సూరయ్యపల్లి గ్రామం లోని మేరీ మీడియా ట్రిక్స్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో యూకేజీ పూర్తి చేసుకుని ఫస్ట్‌క్లాస్‌లోకి అడుగుపెడుతున్న విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఆటాపాటలతో అలరించారు. పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ ఫ్రాన్సిస్, డాక్టర్ మేస్సీ ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన విద్యాబోధన, పాఠశాల ఉపాధ్యాయులతో ఉన్న అనుభవాలను విద్యార్థులకు వివరించారు. చిన్నారుల బంగారు భవిష్యత్‌పై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని,మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంచాలని, చదువుపై శ్రద్ధ పెంచేలా వాతావరణం కల్పించాలని పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సునీ సెబ్‌స్టియన్ సూచించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మేరీ జోసెఫ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హిందీ పరీక్షకు 99.87% మంది విద్యార్థులు హాజరు

ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :జిల్లాలో నేడు జరిగిన 10వ తరగతి హిందీ పరీక్షకు 99.87% మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.హిందీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడ ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని అన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ 1 పరీక్షా సెంటర్ ను, 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 16 సెంటర్లను, అసిస్టెంట్ కమిషనర్ పరీక్షల విభాగం 3 సెంటర్లను, జిల్లా విద్యాశాఖ అధికారి 5 పరీక్షా కేంద్రాలను సందర్శించారని తెలిపారు. హిందీ పరీక్షకు 7383 మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 7374 మంది విద్యార్థులు హాజరయ్యారని, మొత్తం 99.87% హాజరు శాతం ఉందని, పరీక్షలు సజావుగా జరిగాయని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నూతన ఎస్ఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/చొప్పదండి:చొప్పదండి ఎస్ఐగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మామిడాల సురేందర్‌ని శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ప్రజాప్రతినిధులు కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. వారి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, జిల్లా అధికార ప్రతినిధి పెరుమాండ్ల గంగయ్య గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునగాల రాజేందర్, కొట్టె అశోక్, గుర్రం రమేష్, కదారి శంకర్, ముద్దం తిరుపతి, రాములు, రాజేందర్, తాళ్లపల్లి శ్రీనివాస్, డేవిడ్, నల్లాల అఖిల్, విద్యాసాగర్‌లు పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గీకరణ బిల్లును ఆమోదించినందుకు కృతజ్ఞతలు

ప్రజాపక్షం/ బీర్‌పూర్:ఎస్‌సి వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించిన తెలంగాణ ప్రభుత్వానికి అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి పూదురి శోభన్ కృతజ్ఞతలు తెలిపారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాల ఎస్‌సివర్గీకరణ పోరాటాలకు ఫలితంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో 2025ఎస్‌సి వర్గీకరణ బిల్లును ఆమోదించినందుకు అంబేద్కర్ సంఘం తరఫున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమం కాలంలో మరణించిన కుటుంబసభ్యులకు ఇందిరమ్మ ఇండ్లలో రాజీవ్ యువ వికాస్‌లో మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించడం హర్షనీయమం అన్నారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని ఎంఆర్‌పిఎస్ మొదటితరం ఉద్యమనాయకులతో పాటు ప్రస్తుత నాయకులకు ఎస్‌సి వర్గాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీర్‌పూర్ ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షులు సుద్దాల తిరుపతి, మాదిగ, గ్రామశాఖ అధ్యక్షులు గోడిసెల మురళి మాదిగ, పూదురి నర్సయ్య మాదిగ, రాజేశం మాదిగ, గంగారవి మాదిగ, పూదూరి లక్ష్మణ్, సుధాకర్, రాజేశం, మారంపల్లి గంగాధర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు

## చలివేంద్రం ఏర్పాటు

ప్రజాపక్షం/మల్యాల:వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మల్యాల ఎస్ఐ నరేష్‌కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా మల్యాల అడ్డ రోడ్ వద్ద స్వయం కృషి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఎస్ఐ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన ఆటో యూనియన్ సభ్యులను ఎస్ఐ అభినందించారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మహిళా రైతులకు రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు

### మండల వ్యవసాయ అధికారి కరుణ

ప్రజాపక్షం/గొల్లపల్లి : కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రికరణ ఎస్ ఎం ఎ ఎం పథకం ద్వారా మహిళా రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తుందని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వ్యవసాయ అధికారి కరుణ తెలిపారు .సన్న ,చిన్న కారు మహిళా రైతులకు 40శాతం ,అలాగే ఎస్సీ ,ఎస్టి వర్గాలకు చెందిన మహిళా రైతులకు 50 శాతం రాయితీ పై కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు .ఈ పథకంలో రాయితీపై అందించే యంత్ర పరికరాలు 8 బ్యాటరీ స్ప్రేయర్స్ , 8 పవర్ స్ప్రేయర్లు ,4 రోటవేటర్స్ ,ఎంబి ప్లవ్ / 5 కల్టివేటర్స్ /కేజీ వీల్స్ ,బండ్ ఫార్మర్ ,యూనిట్లు ఉన్నాయని తెలిపారు .గొల్లపల్లి మండలంలోని మహిళా రైతులు దరఖాస్తు ఫారం తో పాటు భూమి పాస్ బుక్ ,ఆధార్ కార్డు, ట్రాక్టర్ కు సంబంధించిన పనిముట్లకు ఆర్ సి బుక్ పత్రాలతో రైతు వేదికలో ఈనెల 25వ తేదీలోగా అప్లై చేసుకోవాలని కోరారు . పూర్తి వివరాల కోసం ఆసక్తి గల మహిళా రైతులు సంబంధిత మండల వ్యవసాయ అధికారిని గాని క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని వెల్లడించారు.

## బిఆర్ఎస్‌వై, బిఆర్ఎస్‌వి నాయకుల ముందస్తు అరెస్టు

ప్రజాపక్షం/చొప్పదండి:అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో శనివారం బిఆర్ఎస్‌వై, బిఆర్ఎస్‌వి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్‌వై చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు బందారపు అజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అరెస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందన్నారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తే అక్రమ అరెస్టులు చేయడం తగదని ఖండించారు. ఉస్మానియా యూనివర్సిటీలో జారీ చేసిన నిర్బంధపు సర్క్యులర్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ముందస్తు అరెస్టు చేసిన వారిలో చొప్పదండి మండల యువజన విభాగం అధ్యక్షుడు మారం యువరాజ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు భక్తు విజయ్ కుమార్, చొప్పదండి మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, చొప్పదండి విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు సిరవేణి శ్రీకాంత్, చొప్పదండి విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు నరేష్ రావణ్, మండల జనరల్ సెక్రటరీ దాసరి అనిల్, ఎండి షరీఫ్ తదితరులున్నారు.

## నేడు కరీంనగర్‌కు కెటిఆర్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రానికి రానున్నారు. బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి పాతికేళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేయనున్నారు. కెటిఆర్‌తో పాటు మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఇప్పటికే కరీంనగర్ ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలోని బిఆర్ఎస్ ముఖ్యనేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి కెటిఆర్ హాజరు కానున్న నేపథ్యంలో శనివారం బొమ్మకల్ బైపాస్ రోడ్డులో గల వి కన్వెన్షన్ ఫంక్షన్ హాలు వద్ద కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన వెంట కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులున్నారు.

## మత్తులో యువకుడి హల్‌చల్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:కరీంనగర్‌లో యువకుడు మత్తులో హల్ చల్ చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జ్యోతి నగర్ కెమిస్ట్రీ భవన్ ఎదుట శనివారం యువకుడు మత్తులో రెండస్తుల భవనంపై నుంచి దూకేస్తానంటూ హంగామా సృష్టించాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వలలు, రోప్, నిచ్చెనసహాయంతో యువకుడిని కిందకు దింపే ప్రయత్నం చేశారు. అయితే సదరు యువకుడు పోలీసులను తప్పించుకుని ఒక భవనంపై నుంచి మరో భవనంపైకి దూకాడు. పోలీసులకు చిక్కకుండా పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో ఫైట్ సిబ్బంది కరీంనగర్ స్పెషల్ పార్టీ పోలీసులు యువకుడిని మాటల్లో పెట్టి తాళ్లతో బంధించారు. అనంతరం పోలీసులు ఫైట్ సిబ్బంది సహాయంతో సదరు యువకుడిని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సదరు యువకుడిని గత రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు నగరంలోని రిహాబిలిటేషన్ సెంటర్ టలో చేర్పించారు. అక్కడ నుంచి తప్పించుకుని జ్యోతినగర్ ఏరియాలో తిరుగుతూ హంగామా సృష్టిస్తున్నాడు.

## మహిళ సాధికారతకు నాబర్డ్ మరింత సహకారం..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :మహిళలు ఆర్థికవృద్ధి సాధించాలని నాబర్డ్ ఏజిఎం శ్రీకాంత్,డీడిఎం జయప్రకాష్,దిలీప్‌చంద్ర అన్నారు.శుక్రవారం మండల ఇందిర క్రాంతి పథకం కార్యాలయంలో స్పందన సేవా సమితి సంయుక్తంగా మగ్గం వర్క్ ట్రైనింగ్ శిక్షణ పూర్తయింది.మగ్గం వర్క్ నేర్చుకున్న మహిళలను చూసి ఆనందించారు,డిజైనింగ్ చేయడం,నెలకు ఎంతవరకు ఆర్థికంగా సంపాదించవచ్చుననే ప్రశ్నలను సంధించారు.మళ్లీ రీషెడ్యూల్ చేస్తున్నట్లు కొత్తగా నేర్చుకునే వారి పేర్లు టీచర్లకు ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో స్పందన సేవా సమితి సొసైటీ సిఇఒ శోభా రెడ్డి, ఎపియం మల్లేషంసిసిలు,స్త్రీనిధి కో ఆర్డినేటర్,మగ్గం వర్క్ టీచర్లు చిట్టంపల్లి రేఖ,భవాని,మహిళలు ఉన్నారు.


## అట్టహాసంగా మానేరు విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల 39వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి పద్మనగర్‌లోని మానేరు సిబిఎస్ఈ పాఠశాల ఆవరణలో అట్టహాసంగా జరిగాయి. తేజస్ 2025 పేరిట నిర్వహించిన ఈ వేడుకలను శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ యు.ఉమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో గత 39 సంవత్సరాలుగా విద్యారంగంలో మానేరు విద్యాసంస్థలు దిగ్విజయంగా నడుస్తుండడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి లక్ష్య సిద్ధితో సాధన చేస్తే ఉన్నత ఫలితాలను సాధిస్తారని, లక్ష్యాన్ని ఎంచుకుని అది సాధించే వరకు కష్టపడాలని సూచించారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ 1986 సంవత్సరంలో 80 మంది విద్యార్థులతో ప్రారంభమైన విద్యాసంస్థలు నేడు ఎన్నో వేల మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనందించే విధంగా రూపుదిద్దుకుంటున్నట్లు తెలిపారు. విద్యాసంస్థలలో చదివిన చాలా మంది విద్యార్థులు నేడు డాక్టర్లుగా, సివిల్ సర్వీసెస్ ఉద్యోగులుగా , లాయర్లుగా, సాఫ్ట్‌వేర్లుగా, జడ్జిలుగా, ఇంజనీర్లుగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్నతంగా ఎదిగారన్నారు. మానేరు విద్యాసంస్థల విద్యార్థులు ప్రతి సంవత్సరం వివిధ స్థాయిలో పోటీ పరీక్షలే కాకుండా ఒలింపియాడ్‌లో మానేరు సిబిఎస్ఈ పాఠశాల విద్యార్థి ఆత్రేయ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఇటీవల పుదుచ్చేరిలో సౌత్‌ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మానేరు పాఠశాల విద్యార్థిని ఆర్యాయుస్రా పాల్గొని పలువురి మన్ననలను పొందినట్లు తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మానేరు విద్యార్థులకు అమెరికాలో జరిగే విద్యాబోధనను అందించేందుకు త్వరలో అమెరికాలోని ప్రముఖ విద్యాసంస్థతో ఒప్పందం చేసుకోబోతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జయశ్రీ, రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, మాజీ ఎంపిటిసి శివకుమార్, అనంతాచార్య, ప్రిన్సిపాల్‌లు, వైస్ ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ‘ఎల్లంపల్లి’ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయండి

* అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే మక్కన్‌సింగ్



ప్రజాపక్షం/గోదావరిఖని : పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాశయం ప్రదేశాన్ని పర్యాటకరంగంగా అభివృద్ధి చేయాలని అసెంబ్లీలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్ కోరారు. శనివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ పరిశ్రమలకు, అధ్యాత్మికతకు పుట్టినిల్లు అయిన రామగుండం నియోజకవర్గాన్ని టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. నిత్యం నీటితో నిండి ఉంటున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద రిసార్ట్స్ ఏర్పాటు చేయడం వల్ల సందర్శకులు, పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని రామునిగుండాల కొండ, పురాతన జనగామ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి దేవాలయం, గోదావరినది పరివాహక ప్రాంతం ఆధ్యాత్మికతంగా నిలయంగా ఉన్నాయన్నారు. గోదావరిఖనిలోని సింగరేణి 7 ఎల్ఈపి బొగ్గు గని ప్రాంతాన్ని గతంలో టూరిజం కేంద్రం ఏర్పాటు చేసి మూసివేశారని తిరిగి దానిని యథావిధిగా పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ కోరారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో పారాగ్లైడింగ్, హాట్ బెలూన్స్, నది ప్రాంతంలో బోటింగ్ వంటివి ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ అనుమతి మేరకే వైద్యులు వైద్యం

డాక్టర్ అన్నా ప్రసన్న కుమారి

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :ప్రభుత్వ అనుమతి మేరకు జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటల్లో వైద్యులు వైద్యం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అన్న ప్రసన్నకుమారి అన్నారు. శనివారం రోజున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జిల్లాలో మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్1971 ప్రకారం అనుమతి పొందిన( అక్రిడేషన్ ) ప్రైవేట్ హాస్పిటల్స్ యొక్క స్త్రీ వైద్య నిపుణులకు సమీక్ష సమావేశంను నిర్వహించారు. జిల్లాలో 12 ఆసుపత్రులకు మాత్రమే అనుమతి ఉన్నదనీ ,అందులో ఒకటి ఈ మధ్యనే సీజ్ చేశామనీ చట్ట ప్రకారం కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే గర్భస్రావం చేయుటకు అనుమతి ఇచ్చామని, గర్భవతి ప్రాణంకు ప్రమాదం అయినప్పుడు,గర్భవతికి మానసిక మరియు శారీరక ఆరోగ్యం కు హాని ఉన్నప్పుడు, అంగవైకల్యం గల బిడ్డ పుట్టే అవకాశం ఉన్నప్పుడు, బలత్కారానికి గురి అయి, గర్భం దాల్చినచో, కుటుంబ నియంత్రణ పద్ధతులు ఫెయిల్ అయినప్పుడు మాత్రమే గర్భస్రావం చేయుటకు అనుమతి కలదు. ప్రైవేట్ ఆసుపత్రులు తగిన రికార్డ్స్, రిపోర్ట్స్ నిర్వహణ చేయాలని, గర్భస్రావం పొందిన మహిళ యొక్క వివరాలను బహిర్గతం చేయరాదనీ, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ ( అమెండ్‌మెంట్ ) 2021 ప్రకారం గర్భస్రావాలు చేయుటకు గర్భకాలంను 20 వారాల నుండి 24 వారాల వరకు పెంచారు కానీ ఇద్దరు స్త్రీ వైద్య నిపుణుల అనుమతి (కాన్సెంట్ ) ఉండాలి అని అన్నారు. ఈ చట్టం ప్రకారం వివాహం అయిన వారికి, కాని వారికి కూడా గర్భస్రావం చేయవచ్చు కాని మేజర్ అయి వుండాలి. మహిళ మైనర్ లేదా మానసిక స్థితి సరిగా లేనపుడు గార్డియన్ ల యొక్క అనుమతి తీసుకోవాలి. పై కారణాలు కాకుండా మరియు గర్భస్థ శిశువు లింగ ఎంపిక చేసిన లేదా వారికి గర్భస్రావం చేసిన యెడల చట్ట ప్రకారం శిక్షా అర్హులు అవుతారని హెచ్చరించారు. ప్రతి నెల సంబంధిత రిపోర్టులు కార్యాలయంకు పంపించాలి అని అన్నారు.

## అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాపక్షం/గొల్లపల్లి : అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని లక్ష్మీ పూర్ మాజీ ఎంపీటీసీ గోవిందుల లావణ్య జలపతి అన్నారు. ఈ మేరకు గొల్లపల్లి మండలం వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు నష్టపోయారు .అకాల వర్షాలు కురిసి రైతులకు చేతికొచ్చే పంటలు మొక్కజొన్న ,నువ్వు ,వరి ,మామిడి రైతులకు నష్టం జరిగిందన్నారు .ఇప్పటికే కరువుతో అల్లాడుతున్న రైతులకు ,దిగుబడి లేక పెట్టుబడి రాక రైతులు ఇబ్బంది పడుతున్న తరుణంలో దానికి తోడు అకాల వర్షం తీవ్ర నష్టం చేకూర్చిందని ఆవేదన వ్యక్తం చేశారు .సంబంధిత మండల వ్యవసాయ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ,ఏ పంటలు దెబ్బతిన్నాయో క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేసి పంట నష్టం అంచనా వేసి నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం రైతులకు వచ్చేలా కృషి చేయాలని కోరారు.

## పుట్టెడు దుఃఖంలో పరీక్ష రాసిన విద్యార్థిని

ప్రజాపక్షం/శంకరపట్నం;మండల పరిధిలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని బిసి వెల్ఫేర్ పాఠశాలలో పుట్టెడు దుఃఖంలో పదవ తరగతి పరీక్ష రాసింది. శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన చీర్లవంచ శ్రీధర్ ప్రియాంక దంపతులకు ఇద్దరు కూతుర్లు కుమారుడు ఉన్నారు. ప్రియాంక కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ విషయాన్ని ప్రియాంక కూతురు పౌర్ణమికి తెలియకుండా పరీక్ష రాసే వరకు వేచి చూశారు. పరీక్షలు రాసిన అనంతరం తల్లి మరణించిన విషయాన్ని చెప్పడంతో సిరిసిల్ల జిల్లాలో పరీక్ష రాసిన పౌర్ణమి హుటాహుటిన కొత్తగట్టు గ్రామానికి చేరుకుంది. తల్లి మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. శనివారం సాయంత్రం ప్రియాంక అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య నిర్వహించారు.

## ప్రపంచ జల దినోత్సవ వేడుకలు, క్షేత్ర సందర్శన

ప్రజాపక్షం/కొత్తపల్లి:ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం యొక్క పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాలలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ శాస్త్రవేత్త డా.పి.మధుకర్ రావు మాట్లాడుతూ మానవ జీవనశైలిలో నీటి ప్రాముఖ్యతను వివరించారు. వరిలో నీటి యాజమాన్యం, వినియోగాన్ని పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ శాస్త్రవేత్త డా. ఎ.విజయ భాస్కర్ వివిధ పంటలలో చీడపీడ నివారణ చర్యలకు గాను చేపట్టాల్సిన నీటి యాజమాన్యం గురించి వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ శాస్త్రవేత్త డా.జి.ఉషారాణి వివిధ పంటలలో నీటి ఆదా ప్రక్రియలను, బిందు తుంపర సేద్యం పద్ధతులను పాటిస్తూ నీటిని నిల్వ చేసి భావి తరాలకు అందించాలని సూచించారు. ఎఫ్ఎంసి కంపెనీ సిబ్బంది ఉత్పత్తుల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతి, ఎఫ్ఎంసి సిబ్బంది క్రాంతి, కొండాపూర్, నాగులమల్యాల, బద్దిపల్లి గ్రామాల 52 మంది రైతులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజాపక్షం/వీణవంక:వీణవంక మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు ముదిగంటి విద్యాసాగర్ రెడ్డి తండ్రి మరణ వార్త తెలియడంతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గ్రామానికి వచ్చి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహా రాజు, మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్, రామిడి ఆదిరెడ్డి, పెద్ది మల్లారెడ్డి, ఎనగంటి శ్రీనివాస్, ముత్యాల రవీందర్, బొంగని సదానందం, భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, గొడుగు వినోద్, గోపి, హరీష్, అజయ్, శివ, తిరుపతి రెడ్డి, సతీష్, మారం తిరుపతిరెడ్డి, దాసారపు అశోక్, శ్రీనివాస్, కంకల సంతోష్, అనిల్, బాబురావు, ప్రశాంత్, ముత్యాల సతీష్ తదితరులున్నారు.

## పంట నష్టాన్ని అంచనా వేసి రైతన్నలకు నష్టపరిహారం అందించాలి

మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలం హైదర్ పల్లి గ్రామంలో నిన్న కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న పంటను స్థానిక నాయకులు మరియు రైతులతో కలిసి పరిశీలించిన జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. మాజీ జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి రైతన్నలకు నష్టపరిహారం అందించి రైతన్నలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని మండలాన్ని కేంద్రంగా కాకుండా గ్రామాన్ని కేంద్రంగా తీసుకోవాలని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. అనంతరం హైదర్ పల్లి గ్రామంలోని పర్స వెంకటి అనే రైతుకు చెందిన గేదె పిడుగుపాటుతో మరణించగా రైతును పరామర్శించి ప్రభుత్వం రైతుకు తగిన నష్టపరిహారాన్ని అందించాలని సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగింది.ఈ కార్యక్రమంలోప్యాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంజన్న, సీనియర్ నాయకులు గంగారెడ్డి, సాగి సత్యం రావు, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## మే19 లోపు 'అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి' కి దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:మే 19, 2025 లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి క్రింద ఉన్నత చదువులకై అందించే ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఉప సంచాలకులుఎస్‌సిఅభివృద్ధిశాఖ,బి.వి నోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను అంబేద్కర్ ఓవర్సీస్ వి ద్యా నిధి పథకం ద్వారా ఎస్‌సి విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి అర్హులైన వారు (ఏదైనా 4 సంవత్సరాల డిగ్రీ చదివిన/చివరి సంవత్సరం చదువుతున్న) వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని,అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, జర్మనీ జపాన్, సింగపూర్, సౌత్ కొరియా, మొదలగు దేశాలలో ఉన్నత చదువు చదివేందుకు వెళ్ళేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తి గల పెద్దపల్లి జిల్లాలోని ఎస్‌సిఅభ్యర్థులు https://telanganaepasscbbgov.in ద్వారా మే 19 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఉప సంచాలకులు ఎస్సీ అభివృద్ధి శాఖ,బి.వినోద్‌కుమార్‌ఆప్రకటనలోతెలిపా రు.

## పోలీస్‌స్టేషన్‌లో తాగునీటి సౌకర్యం



ప్రజాపక్షం/రామగుండం : రామగుండం పోలీస్‌స్టేషన్‌లో తాగునీటి వసతిని కల్పించారు. శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా బోర్‌బావి తవ్వారు. గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ బోర్‌బావి తవ్వకం పనులను ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్ కు వచ్చే వారు నీటికై ఇబ్బందులు పడ్తున్నారని అందుకే బోర్‌బావి తవ్వి నీటి వసతిని కల్పించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం ప్రవీణ్‌కుమార్, ఎస్.ఐ. సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## అకాల వర్షంతో దెబ్బతిన్న వరి పంటలు...

ప్రజాపక్షం/వీర్నపల్లి:మండల కేంద్రంలోని శాంతినగర్ గ్రామంలో శుక్రవారం కురిసిన అకాల వర్షంతో దెబ్బతిన్న వరి పంటలను మండల కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. సుమారు 35 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, నష్టపోయిన రైతులు ఎవ్వరు కూడా అధైర్యపడవద్దని అన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ రాములునాయక్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు భూత శ్రీనివాస్, ఎఎంసి డైరెక్టర్లు సంతోష్, లక్ష్మి నర్సయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ప్రకాష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు చంద్రమౌళి తో పాటు దేవేందర్, సంతోష్, రాజు,సజన్, తదితరులు ఉన్నారు. అకాల వర్షంతో దెబ్బతిన్న పంటపొలాలను మండల వ్యవసాయ అధికారిని జయ శనివారం రోజున పరిశీలించారు. పంట న ష్టాన్ని అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తానని అన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటానని తెలపారు. ఆమె వెంట బిజెపి మండల అధ్యక్షుడు , శాంతి నగర్ గ్రామ రైతులు ఉన్నారు.

# నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు తప్పనిసరి

✻ ధర్మపురి సిఐ రాం నర్సింహరెడ్డి



ప్రజాపక్షం /ధర్మపురి :సమాజంలో నేరాల నియంత్రణకు సిసి కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అని, ఒక్క సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, భద్రతా పరంగా ప్రతి గ్రామంలో ప్రార్థన మందిరాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని జగిత్యాల జిల్లా ధర్మపురి సిఐ ఎలపాటి రాం నర్సింహ రెడ్డి తెలిపారు. మండలంలోని నేరేళ్ల గ్రామం అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ సాంబ శివ ఆలయంలో ఎస్ఐ ఉదయ్ కుమార్, ఆలయ చైర్మన్ జాజాల రవీందర్‌తో కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన 5సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ప్రార్థన మందిరాలలో సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని దీనికి ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని అన్నారు. నేరాలను అరికట్టే చర్యల్లో సిసి కెమెరాలు కీలకమని అన్నారు. గ్రామాలు భద్రంగా ఉండాలంటే సిసి కెమెరాల ఏర్పాటుతో పాటు పోలీస్ వాళ్ళకు సహకరిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిసి కెమెరాల ఏర్పాటుకై చొరవ చూపిన చైర్మన్ రవీందర్, ఆలయ కమిటీ సభ్యులను సిఐ ఎస్ఐ అభినందించారు.

## వ్యవసాయం, విద్యా రంగాలకు గతంలోలేని విధంగా కేటాయింపులు

ప్రజాపక్షం /రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : వ్యవసాయం, విద్య తదితర రంగాలకు బడ్జెట్‌లో గతంలో ఎప్పుడు లేని విధంగా కేటాయింపులు చేస్తే దీనిపై బిఆర్ఎస్ బిజెపి నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి విమర్శించారు. శనివారం సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నేతలతో కలిసి సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. బిసి కుల గణనకు చట్టబద్ధత కల్పించి తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు. అధికారంలోకి రాగానే ఇనుప కంచెలను తొలగించి ప్రగతి భవన్ అనే పేరు పెట్టుకుని విలాసవంతమైన జీవితాన్ని గడిపిన పాలకుల యొక్క దుష్ట పరిపాలనను అంతమొందించి జ్యోతిభా పూలే భవనంగా పేరు మార్చినట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి ఆర్థిక దోపిడికి పాల్పడిందన్నారు. ఈ రాష్ట్రాన్ని దివాలా తీసినప్పటికి కూడా ఒక్కొక్క మెట్టుగా వాటి అన్నింటిని అధిగమిస్తూనే ఇవాళ ప్రజలకు ఇచ్చిన హామీని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలను క్రమంగా నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, నాయకులు గడ్డం నర్సయ్య, ఆకునూరి బాలరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం: ఎఐఎస్ఎఫ్, బిఆర్ఎస్

ప్రజాపక్షం/ఇల్లంతకుంట: తెలంగాణ రాష్ట్రంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి నుండి ఎట్లాంటి కార్యక్రమం పిలుపులేకున్నా రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నాయకులను ఉదయం 4 గంటలకు ఇళ్లల్లో చొరబడి అరెస్టు చేయడం అప్రజాస్వామికం అన్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సమితి ఎలాంటి పిలుపు ఇవ్వకపోయినా ముందస్తు అక్రమ అరెస్టులను ఎఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ఇలాంటి పిలుపులు కార్యక్రమాలు లేనప్పుడు సమాచార లోపంతో అక్రమ అరెస్టులు చేయడం చాలా దుర్మార్గం దీనివల్ల వ్యక్తుల వ్యక్తిగత పనులు, సంఘ కార్యక్రమాలు, అడ్డుకున్నట్లే ఇది ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనేనని భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 14 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించి ప్రైవేట్, కార్పొరేట్ శక్తులను పెంచి పోషించి ఇదేవిధంగా అరెస్టులపర్వం కొనసాగిస్తే గత ప్రభుత్వానికి ఏ గది పట్టిందో భవిష్యత్తులో మీకు అదే గతి పడుతుందని హెచ్చరించారు. విద్యారంగ సమస్యల పరిష్కరించి విద్యాశాఖకు మంత్రిని కేటాయించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బి ఆర్ ఎస్ వి మండల అధ్యక్షులు ఎండ్ర చందన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిన ఇప్పటివరకు విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. 14 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు మొన్న జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో విద్యా రంగానికి 30% నిధులు కేటాయించకపోవటం సిగ్గుచేటు అన్నారు.లేనియెడల టిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మళ్లీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తాం అలాగే నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ముందస్తు అరెస్టు ఐన వారిలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య, మండల అధ్యక్షులు బండారి చందు, బిఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షులు బుర్ర సూర్య గౌడ్, మండల సోషల్ మీడియా ఇంచార్జి గుంటిమధు ఉన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో 50 మందికి జరిమానా,41 మందికి జైలు శిక్ష



ప్రజా పక్షం/వేములవాడ టౌన్: వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు 14 రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 91మంది మందు బాబులు పట్టుబడగా వారిని వేములవాడ పోలీసులు శనివారం రోజు కోర్టులో ప్రవేశపెట్టగా 50 మంది మందుబాబులకు జరిమాన 41 మందికి జైలు శిక్షలు (ఇద్దరికి 07 రోజులు జైలు శిక్ష, 07 గురికి మూడు రోజులు జైలు శిక్ష, 05 గురికి ఐదు రోజులు జైలు శిక్ష, 27 మందికి రెండు రోజుల జైలు శిక్ష మొత్తంగా (1,99,600/రూపాయల) జరిమానా విధిస్తు వేములవాడ JFCM మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లోపట్టుబడిన మందు బాబులకు పట్టణ ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్.ఐ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ ప్రతి రోజు పట్టణ ప్పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడిన వారికి వారి తల్లితండ్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశాలకు పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతయని, ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పిడుగు పాటుతో గేదే మృతి, ఉపాధి కోల్పోయిన రైతు

ప్రజాపక్షం/జగిత్యాల రూరల్:జగిత్యాల రూరల్ మండలంలోని హైదర్ పల్లి గ్రామంలో విషాదం. శుక్రవారం రోజున రాత్రి ఉరుములు పిడుగులతో కురిసిన వడగాళ్ల వర్షంతో పిడుగు పాటుకు హైదర్ పల్లి గ్రామానికి చెందిన పర్స వెంకటి అనే రైతుకు చెందిన సుమారు ఒక లక్ష రూపాయల విలువ గల గేదే మృతి చెందిదని వెంకటి ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన గేదేను పొలాస వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణ చందర్, హైదర్ పల్లి గ్రామ కార్యదర్శి శంకర్ పరిశీలించటం జరిగిందని వారు తెలిపారు.

## జ్యోతి హైస్కూల్‌లో ఎల్ఇడి బల్బుల తయారీ

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐబిటి అకాడమీలో ఎల్.ఈ.డి బల్బులను తయారీ చేయడం నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ బియ్యల హరి చరణ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా హరి చరణ్ రావు మాట్లాడుతూ తెలంగాణ ఇన్నోవేటర్, వైజ్ఞానిక తపస్వి, సెన్సార్ మల్లేశం ఆధ్వర్యంలో ఎల్ ఇ డి బల్బ్ లు విద్యార్థుల చే తయారు చేయించటం జరిగిందన్నారు.మన గ్రామంలో మన జిల్లాలో, మన రాష్ట్రంలో, మనదేశంలో ప్రొడక్ట్ తయారవుతే యువతకు ఉపాధి కల్పన జరుగుతుందనే ఉద్దేశంతో మేకిన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్ ప్రోడక్ట్ కు ప్రాధాన్యత ఇవ్వాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు విద్యార్థులకు ప్రోడక్ట్ మేకింగ్ నేర్పిస్తే నిరుద్యోగ సమస్యతో బాధపడకుండా ఉపాధి కల్పించే స్థాయిలో ఎదుగుతారని ఉద్దేశంతో ఎలక్ట్రానిక్ ప్రోడక్ట్ మేకింగ్ వర్క్ షాప్ ను నిర్వహించడం జరిగిందన్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ది యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ మిషన్ ఈ వర్క్ షాప్ కి స్ఫూర్తినిచ్చిందన్నారు . ఈ వర్క్ షాప్ మార్చి 2124 తేదీలలో జరగనుండగా, మొదటిరోజు దాదాపు 376 మంది విద్యార్థులు స్వయంగా ఎల్ఈడి బల్బులను తయారు చేసుకొని వారికి ఇంటికి తీసుకువెల్లారని చెప్పారు. ఈ కార్యక్రమం చిన్నారులకు విద్యార్థి దశ నుండే వారికి వివిధ రంగాల్లో మెలుకువ నేర్పించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ శ్రీధర్ రావు, మౌనిక రావు, ఉపాధ్యాయ బృందం, ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వడగండ్లు... కడగండ్లు...



ప్రజాపక్షం/ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షం.. కడగండ్లను మిగిల్చింది. శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన అకాల వర్షంతో మండలంలోని పలు గ్రామాలలో మొక్కజొన్న, వరి పంటలు నేలకొరిగాయి. మామిడికాయలు నేలరాలి తీవ్ర నష్టం కలిగించింది. రాయపట్నం గ్రామంలో రైతులు పోతరాజులచంద్రమౌళి, పాయిల శ్రీనివాస్, ముక్కెర ప్రశాంత్, బిళ్లకూరి శేఖర్‌లకు చెందిన 70 ఎకరాలలో వేసిన వరి పంట నేలకొరిగింది. మరో 20 రోజుల్లో పంట చేతికొస్తుండగా శుక్రవారం కురిసిన గాలివానకు పంట దెబ్బతిని తీవ్ర నష్టం కలిగించిందని తమని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మరోవైపు ధర్మపురి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేసుకున్న చిరువ్యాపారుల షెడ్లు గాలికి కొట్టుకుపోయాయి. వీరిని ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఎల్ఆర్ఎస్ ప్రొసిడింగ్స్ అందజేత

ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం నగరపాలక కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ అర్జీదారులకు ప్రొసిడింగ్‌లను ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ శనివారం అందజేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు చెల్లించాల్సిన రుసుంలో 25 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నదని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ నెలాఖరుతో గడువు ముగియనున్నందున దరఖాస్తుదారులు త్వరపడాలన్నారు. అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి నిర్దేశ రుసుం చెల్లించినట్లయితే వెంటనే ప్రొసిడింగ్స్ జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్ ప్రసాద్, పట్టణ ప్రణాళికా విభాగం అధికారి నవీన్‌లు పాల్గొన్నారు.

# నేడు 'జైబాపు, జై భీమ్, జై సంవిధాన్, జై భారత్'



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : మహాత్మా గాంధీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి 100 సంవత్సరాలు పూర్తి కావడం, భారత రాజ్యాంగ రచనకు 75 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, జై భారత్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ తెలిపారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ఈ కార్యక్రమ లక్ష్యమని, రాజ్యాంగ మార్పు ఆలోచనలను ఖండించడంతో పాటు, రాజ్యాంగ పరిరక్షణ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడమే ఉద్దేశమని తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్స్‌లో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుమార్, కోఆర్డినేటర్‌గా బిసి జనరల్ సెక్రెటరీ దుర్గం భాస్కర్ హాజరుకానున్నారని తెలిపారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి బాలేష్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ శ్యామ్, మండల అధ్యక్షుడు చరణ్, జిల్లా నాయకులుఖలీం తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో అర్ధమండల దీక్షలు ప్రారంభం



ప్రజాపక్షం /ఆసిఫాబాద్ : హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తుల అర్ధమండల దీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం ఆలయంలో 120 మంది భక్తులు అర్ధమండల దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి అర్చకులు ఒజ్జల శిరీష్ శర్మ, శ్రీనివాస శర్మ, శేఖర శర్మల ఆధ్వర్యంలో గణపతి పూజ, నవగ్రహ పూజ, ఆంజనేయ స్వామి రుద్రా భిషేకం, అష్టోత్తర శతనామ పూజ, మంగళహారతి, మహా మంత్రపుష్పం, మహా ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. దీక్షా కాలంలో భక్తులు పాటించాల్సిన నియమ నిబంధనలు వారికి వివరించారు. ఆలయ కమిటీ సభ్యులు పిన్నా వివేక్, ధర్మపురి వెంకటేశ్వర్లు, రూప్పూర్ రమేష్, ఎకిరాల శ్రీనివాస్, నారాయణ మూర్తి, లక్ష్మణమూర్తి, మధు, సుధాకర్, గణపతి, సత్యనారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

# ఆదివాసీ మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

## ఆదివాసీ సంఘాల ఆగ్రహం

ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : ప్రజా సమస్యల పరిష్కారంలో అనుభవం ఉన్న మంత్రిని కించపరచడం తగదని మాజీ ఎంఎల్‌ఎ ఆత్రం సక్కు మండిపడ్డారు. ఆదివాసి మంత్రి సీతక్కపై కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇంచార్జ్ రావి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు అసహ్యకరమని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆసిఫాబాద్ మాజీ ఎంఎల్‌ఎ ఆత్రం సక్కు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివాసి సంఘాల నాయకులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అనుభవం ఉన్న మంత్రిని కించపరిచేలా మాట్లాడటం తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు. రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని, ఆయనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఆత్రం సక్కు హెచ్చరించారు. అనంతరం ఆదివాసీ సంఘాల నేతలు మాట్లాడుతూ, మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, కాంగ్రెస్ నుంచి రావి శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

**రావి శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు:** సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జి రావి శ్రీనివాస్ వ్యాఖ్యలపై తీవ్ర నిరసన వ్యక్తం అవుతుండటంతో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రావి శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు విశ్వప్రసాద్ తెలిపారు. పూర్తిస్థాయి క్రమ శిక్షణ చర్యలు తీసుకునే వరకు పార్టీ అధిష్ఠానం పై ఒత్తిడి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ జెడ్‌పి చైర్మన్ గణపతి, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్యామ్, చరణ్, వసంతరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కాసిపేట గనుల్లో ఐఎన్‌టియుసి సంబరాలు



సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాపక్షం/ కాసిపేట : మందమర్రి ఏరియాలోని కాసిపేట 1, 2 ఇంక్లైన్ గనుల్లో ఐఎన్‌టియుసి ఆధ్వ ర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు ఐఎన్‌టియుసి కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మాణం చేయడం, ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా చట్టపరమైన చర్యలు చేపట్టడాన్ని స్వాగతిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు, క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ కాంపెల్లి సమ్మయ్య మాట్లాడుతూ రాహుల్ గాంధీ జోడో యాత్రలో బిసిల సమస్యలను గుర్తించారని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే బిసి కులగణన చేపట్టి, రిజర్వేషన్లు 23శాతం నుండి 42 శాతం కి పెంచడం చరిత్రక నిర్ణయం అని అన్నారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లును కూడా అసెంబ్లీలో ఆమోదించడం అభినందనీయమన్నారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య మాట్లాడుతూ ఐఎన్‌టి యుసి సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి. జనక్ ప్రసాద్ నేతృత్వంలో సింగరేణి పరిరక్షణకు కృషి జరుగుతోందని, కొత్త గనులను తెచ్చేందుకు, ఉద్యోగావకాశాలను పెంచేందుకు ఐఎన్‌టియుసి అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ కార్యదర్శి పానుగంటి వెంకటస్వామి, ప్రచార కార్యదర్శులు శంకర్ రావు, బన్న లక్ష్మన్ దాస్, ఏరియా నాయకులు సీద్రాల రాజన్న, పిట్ సెక్రెటరీ శనిగారపు రవీందర్, సోగాల కన్నయ్య, పిట్టల శివకుమార్, అడెపు శ్రీకాంత్, దినేష్, సంపత్, నాగరాజు, అట్లా సంపత్, ముత్తమల్ల శ్రీనివాస్,పాల్గొన్నారు.

# పత్రికా స్వేచ్ఛను హరిస్తే సహించేది లేదు



ప్రజాపక్షం / మందమర్రి : పత్రికా స్వేచ్ఛను కించపరిచే ఏ చర్యనైనా తీవ్రంగా ఖండిస్తా మని మందమర్రి ప్రెస్ క్లబ్ నాయకులు హెచ్చరించారు. పాత్రికేయులు ప్రజలకు నిజమైన సమాచారం అందించే బాధ్యతను నెరవేర్చడంలో ఆటంకాలు సృష్టించడం అనాగరిక ధోరణి అని పేర్కొన్నారు. శనివారం మందమర్రి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాండ్ల సంజీవ్, జనరల్ సెక్రెటరీ కడారి శ్రీధర్, ట్రెజరర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ అంగడి బజార్‌కు చెందిన నస్పూరి వినయ్ గత ఫిబ్రవరిలో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆయన భార్య భాగ్యలక్ష్మి మార్చి 19న విలేకరుల సమావేశంలో ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆమె భర్త మృతికి వొడ్నాల శ్రీనివాస్, అతని భార్య మమతతో పాటు మరికొందరు కారణమని, అనుమానంతో దాడికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారని వివరించారు. ఈ వార్తను విధి నిర్వహణలో భాగంగా ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రచురించగా వారిపై లీగల్ నోటీసులు పంపడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని మండిపడ్డారు. పాత్రికేయుల బాధ్యతాయుతమైన పాత్రను అర్థం చేసుకోకుండా ఇలాంటి నోటీసులు పంపించడం అనాలోచిత చర్య అని అన్నారు. న్యాయ వాది సదన్ కుమార్, క్లయింట్ వొడ్నాల శ్రీనివాస్ తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. పాత్రికేయుల హక్కులను కాపాడేం దుకు అన్ని విధాలా పోరాడతామని స్పష్టం చేశారు. ప్రెస్ క్లబ్ సభ్యులు వజీర్ హుస్సేన్, గుడికందుల రమేష్, శివశంకర్, నరేందర్, రాజులకు పంపిన నోటీసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం



ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ : నస్పూర్ మున్సిపల్ పరిధిలోని తీగల్పహాడ్ గాయత్రి నగర్ (హౌస్ నెంబర్ 10166/3ఎ) వద్ద ఇంటి ప్రహరీలో ఉన్న వి ద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారిందని, దాన్ని వెంటనే తొలగి ంచాలని నివాసితులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు. పెరుక సునీత, శ్రీనివాస్ దంప తులు మీడియాతో మాట్లాడుతూ సమస్యను పలుమార్లు విద్యుత్ అధి కారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వాపోయారు. మా ఇం టిపై ఎల్‌టి పోల్ నుంచి వైర్లు తెగిపడుతూ మంటలు చెలరే గుతు న్నాయని, ఇద్దరు పిల్లలతో కలిసి ప్రాణభయంతో జీవిస్తున్నాం అం టూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాపాయ ఘటనలు చోటుచే సుకోక ముందే విద్యుత్ స్తంభాన్ని తొలగించి, పక్కకు మార్చాలని వేడుకున్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సూచికలు ఏర్పాటు





ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ : తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు శ్రీరాంపూర్ బస్టాండ్ నుంచి జిఎం ఆఫీస్ వరకు ఉన్న జాతీయ రహదారిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు సిఐ వేణు చందర్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సాయంత్రం, రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటి నివారణ కోసం అధికారి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సూచికలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని, వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వాడకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్ఐ మేకల సంతోష్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాల కేసును ఛేదించిన పోలీస్ అధికారులు..నిందితుడి అరెస్టు



ప్రజాపక్షం/ కాగజ్ నగర్ : కాగజ్ నగర్ పట్టణంలోని బాలాజీ నగర్ ప్రాంతంలో గత రెండు నెలలుగా చోటు చేసుకున్న మూడు దొంగతనాల కేసును ఛేదించి, ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ పల్నాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కేసు వివరాలను వెల్లడించారు. బాలాజీ నగర్‌కు చెందిన జంజిరాల ప్రదీప్ తన సమీప బంధువుల ఇండ్లలో వారు లేని సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కాగజ్ నగర్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, సిసి టివి ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, నిఘా బృందాల సహాయంతో విస్తృత దర్యాప్తు నిర్వహించామని తెలిపారు. అనేక కోణాల్లో విచారణ జరిపి, నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. అతని వద్ద నుంచి 86.6 గ్రాముల బంగారు ఆభరణాలు, టిఎస్ 03 ఎఫ్ఎఫ్ 3556 నెంబర్ గల కారు, ఒక సెల్‌ఫోన్, రూ. 12 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో సిసి టివి ఫుటేజీ కీలకపాత్ర పోషించిందని, ప్రజలు ఇంటి భద్రతను మెరుగుపరిచేం దుకు సిసి టివిలు ఏర్పాటు చేయడం తప్పనిసరిగా పాటించాలని, ఇది దొంగతనాలు అరికట్టడంలో ముఖ్యమైన సాధనమని సూచిం చారు. ఇండ్లలో అధునాతన భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవడం, అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండడం అవసరమని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐలు సుధాకర్, సురేష్, యాదగిరి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికల ద్వారా దేశ ఆర్థిక భారం తగ్గుతుంది



ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : జమిలి ఎన్నికలు నిర్వహించడం వల్ల దేశ ఆర్థిక భారం తగ్గి, అభివృద్ధిలో ముందుకు వెళుతుందని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో విద్యార్థులు, మేధావులు, విశ్రాంత ఉద్యోగుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరువేరు రాష్ట్రాల్లో విడతల వారీగా ఎన్నికలు నిర్వహించటం వల్ల ఎన్నికల కోడ్ వర్తింపు కారణంగా సంక్షేమ పథకాలు నిలిచిపోతున్నాయని తెలిపారు. తద్వారా అభివృద్ధి ప రంగాదేశం వెనుకబడి పోతుందన్నారు. విద్యార్థులు, మేధావుల అభిప్రాయాలను నమోదు చేసుకుని, జమిలి ఎన్నికల ప్రయోజనాలను వారికి వివరించామని పేర్కొన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ మండల కన్వీనర్ గద్దల కరణ్, కో కన్వీనర్ పిదుగు సురేష్, కళాశాల కరస్పాండెంట్ సాయిని రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది దీపక్, రిటైర్డ్ ఎస్ఐ వెంకన్న, నాయకులు ముషీర్ తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం టెలిఫోన్ ప్రజావాణి

కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం ప్రతి సోమవారం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో 24.03.25 నుండి ప్రతీ సోమవారం ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి తమ అర్జీలను సమర్పించేందుకు వీలుగా ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు టెలిఫోన్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగా ప్రజలు తమ ఇంటివద్ద నుంచే 9100577132 ఫోన్ నంబర్ ను సంప్ర దించడం ద్వారా నేరుగా తమ సమస్యలను తెలిపి, దరఖాస్తులను వాట్సప్ ద్వారా పంపవచ్చునన్నారు. జిల్లాలోని దూర ప్రాంత ప్రజలు టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ

**ప్రజాపక్షం/బైంసా:** జిల్లా విద్యాశాఖధికారి పి.రామారావు బైంసా మండలంలోని జెపిహెచ్ఎస్ తిమ్మా పూర్ ఉన్నత పాఠశాల జెపిహెచ్ఎస్ దిలవార్పూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించారు.ఈ రోజు ద్వితీయ భాష పరీక్ష నిర్వహించడం జరిగింది.అక్కడి సీఎస్ డిఓ లకు పలు సూచనలు చేశారు. కాపీయింగ్ జరగకుండా అందరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పరీక్షలో 9116రే గాను 9108 మంది హాజరయ్యారని,8 మంది గైర్హాజరు అయ్యారని ఆయన తెలిపారు.ఇందులో పరీక్షల విద్యా శాఖ సమన్వయ కర్త లింబాద్రి,ముఖ్య పర్యవేక్షకులు,శాఖధికారి పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ నాయకులు ముందస్తు ఆరెస్ట్..



**ప్రజాపక్షం/దిల్వార్పూర్ :** అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో దిలావర్పూర్ మండల టిఆర్ఎస్ నేతలను శనివారం రోజు పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.ఈ సందర్భంగా మండల టిఆర్ఎస్ అధ్యక్షడు చిన్నా రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన రుణ మాఫీ హామీలను పూర్తిగా మాపీ చేయలేదని ఆయన అన్నారు. మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ఇవ్వడంలేదని తీవ్రంగా మండి పడ్డారు.మాటామాటికి నేతలను అరెస్టు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలను హామీలు చేయండి అని అన్నారు ఇందులో నిర్మల్ జిల్లా గ్రీన్ ఇండియా చాలెంజ్ అధ్యక్షుడు రాథోడ్ అశోక్ గంగారెడ్డి శ్రీనివాస్ విలాస్ అరుణ్ ఉన్నారు.

# కుమ్రం భీం గడ్డపై జాతీయ పురస్కార వేడుక

సినీ దర్శకుడు నాగబాల సురేష్ కుమార్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** విరోచిత పోరాటానికి ప్రతీకగా నిలిచిన కుమ్రం భీం గడ్డపై జాతీయ పురస్కార అవార్డుల వేడుక నిర్వహిస్తున్నట్లు సినీ దర్శక, నిర్మాత నాగబాల సురేష్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడారు. నవజ్యోతి సాంస్కృతిక సంస్థ 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, అలాగే డైలాగ్ కింగ్ సాయికుమార్ సినీ రంగ ప్రవేశానికి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కుమ్రం భీం జాతీయ పురస్కార కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని భారత్ కల్చరల్ అకాడమీ, ఆదివాసి సాంస్కృతిక పరిషత్, ఓం సాయి తేజ ఆర్ట్స్, నవజ్యోతి సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. సినీ నటుడు సాయికుమార్, మాజీ ఐఎఎస్ అధికారి పార్థసారథి, హాస్యనటులు బాబు మోహన్, శివారెడ్డి, నిర్మాతలు రాహుల్ యాదవ్, విజయ్ కుమార్ తో పాటు సినీ, టివి రంగానికి చెందిన ప్రముఖులు ఈ వేడుకకు హాజరవు తారని తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణ నడిఒడ్డున ఉన్న అంకుమ రాజు సమా ధి ఆలయం అభివృద్ధి చెందకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అవార్డు కార్యక్రమం సందర్భంగా 200 మంది కళాకారులచే వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళామ్మతల్లి సాక్షిగా జరిగే ఈ వేడుకను విజయవంతం చేసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నవజ్యోతి సంస్థ సభ్యు లు సిడాం అర్జున్ మాస్టర్, ధర్మపురి వెంకటేశ్వర్లు, సాయిని రాజశేఖర్, అనుమాండ్ల మధు, చంద్రశేఖర్, రాధాకృష్ణ, బాపూరావు పాల్గొన్నారు.

# విద్యార్థులంతా సామాజిక అంశాలపై అవగాహన

జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచి సామాజిక అంశాలపై అవగాహనను కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్ తెలిపారు.శనివారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో బాలశక్తి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సందర్శనకు వచ్చిన నిర్మల్ కేజీబీవీ విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు జిల్లాలో ప్రత్యేకంగా బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు కలెక్టర్ కార్యాలయ పనితీరు,రెవెన్యూ అంశాలు,తదితర విషయాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులంతా చరిత్ర,రాజ్యాంగం,జనరల్ నాలెడ్జ్ పై పట్టు సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగాలను సులభంగా సాధించవచ్చును అన్నారు.పలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులు సమీకృత జిల్లా కార్యాలయాలను సందర్శించారు.ఈ కార్యక్రమంలో అధికారులు సలోమి కరుణ, డాక్టర్ శ్రీనివాస్,కేజీబీవీ విద్యార్థినులు పాల్గొన్నారు.

# భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో అవగాహన



**ప్రజాపక్షం/కడెం :** కడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో మార్చి 22 అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా మండల రైతులకు,మహిళ సమాఖ్య సభ్యులకు నీటి పొదుపు,నిత్యజీవితంలో నీటి ప్రాముఖ్యత,ఇంకుడు గుంతలు, తదితర అంశాలపై భూగర్భ జల శాఖ అధికారులు అవల్ స్వచ్ఛంచ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా భూగర్భ జల శాఖ అధికారి పి.శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ,నీరు లేకుంటే మానవ మనుగడ సాధ్యం కాదని,మనుషులకే కాకుండా జీవులన్నింటికి నీరు చాలా అవసరమని తెలిపారు.ప్రతి ఒక్కరు బాధ్యతగా నీటిని వృధా చేయకుండా పొదుపు చేయాలన్నారు.ఎన్నో దేశాలు నీరు దొరకక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని,నీటిని పొదుపుపు చేయడం ద్వారా భావితరాలకు నీటిని అందించిన వారమవుతామని తెలిపారు.అనంతరం డిఆర్డిఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవడం ద్వారా వర్షపు నీరు,నిత్యవసరాలకు వినియోగించిన నీరు ఇంకుడు గుంతలలో ఇంకి భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి అన్నారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు.ఆదర్శ రైతులు మల్లేష్ రాజ మల్లు,బైరి గంగరాజు లను అధికారులు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఆరుణ,మండల వ్యవసాయ అధికారి దినేష్,ఉద్యానవన అధికారి స్పందన, ఈజీఎస్ హెచ్ఆర్ సుధాకర్,మిషన్ భగీరథ ఏఈఈ అభిలాష్,నీటిపారుదల ఏఈఈ విశాల్,మండల పంచాయతీ రాజ్ అధికారి కవిరాజ్,రైతులు,మహిళా సమాఖ్య సంఘ సభ్యులు,ఇతర అధికారులు,సిబ్బంది, పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నీటి కొరత..



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నీటి ఎద్దడి నెలకొంది అని కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ రాజేష్ జాదవ్ కు వినతి పత్రం అందజేశారు.డబుల్ బెడ్రూం కాలనీలో గత కొన్ని రోజులుగా నీటి తీవ్రత ఎక్కువ అవుతుందని కాలనీ వాసులు కమిషనర్ తో అన్నారు.డబుల్ బెడ్ రూమ్ కాలనీలో బ్లాక్ వైస్ గా ఉన్న బి6,బి7,సి5,సి6 బ్లాక్ లో గత మూడు రోజుల నుండి సరిగ్గా నీరు రావడం లేదని ఉన్న ఒక్క ట్యాంక్ తో వాటర్ పూర్తి స్థాయిలో అందడం లేదని గతంలో కూడా మున్సిపల్ వాటర్ ట్యాంకర్ ద్వారా కాలానీకి వాటర్ అందించారు అని అన్నారు.డబల్ బెడ్ రూమ్ కాలనీకి వచ్చి అక్కడి నీటి పరిస్థితి చూసి మాకు నీరు అందేలా చూడాలని,ఇప్పుడే ఈ విధంగా ఉంటే రానున్న పూర్తి స్థాయి వేసవి కాలంలో ఇంకా తీవ్రంగా ఉంటుంది అని డబుల్ బెడ్ రూమ్ కాలనీకి పూర్తిస్థాయిలో నీటి వసత కల్పించాలని కోరారు.దీనికి కమిషనర్ సానుకులంగా స్పందించి అక్కడ కాలనీకి పూర్తిస్థాయిలో నీరు సరఫరా అందేవిధంగా చూస్తానని,నీటి సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

## పరీక్షల్లో విజయం భవిష్యత్తుకు బలం

సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్



**ప్రజాపక్షం/మందమర్రి :** పరీక్షల్లో విజయం సా ధించడం విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తు oదని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్ర టరీ జి. శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం నుండి ప్రత్యేకంగా విచ్చేసిన ఆయన సింగరేణి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో సమావేశమై పరీక్షల సమయంలో పాటించాల్సిన సూచనలు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్షల్లో విజయవంతం కావాల oటే ఆత్మవిశ్వాసంతో పాటు సరైన ప్రణాళిక అవసరమని, ఒత్తిడిని అధిగమించేందుకు నిర్ణీత విధానాలను అనుసరించడం ముఖ్యమని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి అని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ సి అండ్ ఎండి బలరాం విద్యార్థులకు ఆశీస్సులు పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## విధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

జిల్లా పరిశీలకుడు శ్రీనివాస్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాలోని పదవ తరగతి పరీక్షల నిర్వహణను జిల్లా పరిశీలకుడు టి.శ్రీనివాస్ శనివారం నిర్మల్ లోని రవి,ఈద్గావ్ విజయ, కస్బా, జుమ్మేరాత్‌పేట్, ఆశ్రమ ఉన్నత పాఠశా లలో సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన సీ గదు లన్నీ తిరిగి అక్కగ జరుగుతున్న పరీక్షల నిర్వహణకు పరిశీలించారు.ఈ కేంద్రంలో కేటాయించబడిన ఎటువంటి కాపీయింగ్ జరుగకుండా పరీక్షలను నిర్వహించాలని సూచించారు. సీటింగ్ అరేంజ్మెంట్ పద్ధతి ప్రకారం చేయాలన్నారు. ఇన్విజిలేటర్‌లు ఓఎంఆర్లను గుర్తించి,ఎవరి ఓఎంఆర్లు వారికి ఇవ్వాలని సూచించారు.పరీక్షల విధుల పట్ల జాగరూకతతో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు,శాఖాధికారులు,ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలం లోని అంబేద్కర్ కూడలి లో బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్,ఆధ్వ ర్యం లో ముఖ్యమంత్రి చిత్రప టానికి పాలాభిషేకం నిర్వహిం చడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమో దిస్తూ,ఎస్సీ వర్గీకరణ బిల్లు,తీసుకువచ్చిన చారిత్రత్మక సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,బిసి దళిత బంధువుడయ్యాడని అణగా రిన ప్రజలపై ఆయనకున్న అంకుటిత దీక్షకు ఇది సూచికని అన్నా రు. అనంతరం కొరటికల్ లింగట్లలో పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ ఈజీఎస్ నిధుల నుండి 20 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్డుకు డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు.మంత్రి సీతక్క, సహా యంతో నియోజకవర్గానికి 12 కోట్ల అభివృద్ధి పనులను తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామని,మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యంత్ర పరికరాలకు దరఖాస్తు

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని మహిళా సన్న చిన్న కారు రైతులకు వ్యవసాయ యంత్రికరణ ఉప పథకం కింద రాయితీపై యంత్ర పరికరాలు అందజేయబడినని ఆసక్తి గల లబ్ధిదారులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని శనివారం వ్యవసాయ విస్తరణ అధికారిణి కృష్ణవేణి,తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం సబ్సిడీతో మిగతా వర్గాలకు 40 శాతం రాయితీతో యంత్ర పరికరాలు అందజేయడం జరుగుతుందని అన్నారు.

# రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** వడగళ్ల వానతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదు కోవాలని, రైతాంగానికి టోపీ పెట్టిన గంగాకావేరిసీడ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎఐ యుకె ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం సిరికొండ, ధర్పల్లి మం డలాల్లోని పలు గ్రామాల్లో వడగళ్ల వానతో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. రైతాం గాన్ని తక్షణమే ఆదుకోవాలని గత నాలుగేళ్ల నుండి ప్రకృతి విలయతండావంతో నిండా మునుగుతున్న రైతాం గంను మానవతా దృక్పథంతో ఆలోచించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, దేవరాం, బాబన్న, కిషన్, అనిల్, కిషోర్, జనార్ధన్, పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి లోటుపాట్లు లేకుండా పర్యవేక్షణ చేయాలని సీపీ సాయి చైతన్య ఆదేశించారు. రెండవ రోజు జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పరీక్ష కేంద్రంను సందర్శించి పరీక్షా సరళి పరిశీలించారు. పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా లోపాలు ఉండకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ 2023 అమలులో ఉంటుందని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు శాఖ పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు జరిగిం దన్నారు. అనంతరం స్మార్ట్ వాల్వేషన్ జరుగుతున్న నిర్మల హృదయ స్కూల్ ను సందర్శించి పరిశీలించారు. సిఐ శ్రీనివాస్‌రాజ్ బందోబస్తు సిబ్బంది ఉన్నారు.

# పంటల పరిశీలన

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ధర్పల్లి మండలం వాడీ గ్రామంలో శుక్రవారం వడగళ్ల వానతో నష్టపోయిన పంట పొలాలను ఏడీఏ ప్రదీప్‌కుమార్, ధర్పల్లి మండల ఏఓ పరిశీలించారు. శనివారం ఉదయం వడగళ్ల వానకు నష్టపోయిన వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు జరిగిన నష్టాన్ని తెలుసుకుని మాట్లాడారు. ధర్ప ల్లి మండలంలోని ధర్పల్లి, హోన్నాజీపేట్ రెవెన్యూ గ్రామం వాడీలో 174 రైతులకు సంబంధించిన 265 ఎకరాల పంట నష్టపోయిందని ప్రాథమిక నివేదికను తహసీల్దార్ జిల్లా వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి పంపిస్తామని రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



# కార్మికులకు పెరిగిన కరువుభత్యం అమలు చేయాలి

## టియూసిఐ కార్యదర్శి కట్ల రాజన్న

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం ఏప్రిల్ 1వ తేదీ నుండి,అమలు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం శనివారం రోజున,జిల్లా కేంద్రంలో గల భగత్సింగ్ భవన్ లో నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు ఏప్రిల్ 1వ తేదీ నుండి పెరిగిన కరువు భత్యం వెంటనే అమలు చేయాలని బీడీ పరిశ్రమల యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.(వీడీఏ) కరువు భత్యం 104 పాయింట్లు పెరిగిందని,పాయింట్‌కు పది పైసలు చొప్పున 10 రూపాయల 40 పైసలు,దీని ప్రకారం వేయి బీడీలకు మొత్తం కూలీ రేటు 261.97 పైసలు అవుతుందన్నారు. నెలసరి ఉద్యోగులకు చాటల్ వారికి బట్టీవారికి,నెలకు రూ.312,బీడీ ప్యాకర్లకు రోజుకు 10 రూపాయల 40 పైసల చొప్పున పెరిగిందన్నారు.పెరిగిన కరువు భత్యం రూపాయలను ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు.యాజమాన్యాలు అలసత్వం ప్రదర్శిస్తే,కరువు భత్యం అమలు కోసం బీడీలు చుట్టే కార్మికులు నెలసరి జీతాల ఉద్యోగులు,బీడీ ప్యాకర్లు ఆందోళనకు సిద్ధం కావాలని బీడి కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఏం.బక్కన్న,జిల్లా సహాయకార్యదర్శి ఎస్.గంగన్న, చిల్ల కోశాధికారి ఎండి గఫూర్.పి.ఓ.డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఏప్రిల్ 1నుండి ప్రజలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలి

## జిల్లా అదనపు కెలక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** ఏప్రిల్ 1నుండి ప్రజలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవె న్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. రేషన్ దుకాణాలలో సన్న బియ్యం సరఫరా అంశంపై రేషన్ డీలర్లు,రెవెన్యూ అధికారులతో ఆయన శనివారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహి ంచారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆదే శాల మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అన్ని రేషన్ దుకాణాలలో సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. ప్రజలెవరికి ఎట్టి పరిస్థితుల్లో నూ దొడ్డు బాయ్యాన్ని ఇవ్వవద్దు అన్నారు.సన్న బియ్యం జారీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు.వేసవికాలం ఎండలు అధికంగా ఉన్నదున్న రేషన్ దుకాణాలకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాట్లు చేయాలని,ప్రజలుకు ఎండ నుంచి రక్ష ణ కల్పించేలా తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. సివిల్ సప్లయిస్ డిఎం వేణు గోపాల్,డిఎస్ఓ కిరణ్ కుమార్,రేషన్ డీలర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు



## సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు స్పందించాలి

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ కిషన్ రెడ్డి రైస్ మిల్ పక్కన ఉన్న కాలనీవాసులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు.చేత్త చెదారం సరిగ్గా తొలగించకపోవంతో దోమలు పెరిగి ప్రజలను ఇబ్బదులను గురి చేస్తున్నాయి.దీంతో పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా,మురికి నీరు బోర్లలో కలవడంతో శుద్ధమైన తాగునీరు అందక ప్రజలు ఇబ్బందిఆ పడు తున్నారు.రోడ్డు పై మోరి పైపు లోపలకి వెళ్లిపోవడంతో రోడ్డు నడవడానికి చాలా ఇబ్బందిగా మారింది. వర్షాకాలం వస్తే ఈ పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతుందనే భయంతో స్థానికులు ఉన్నారు. మురికి నీరు రోడ్డుపై నిల్వ ఉండటం,పందులు సంచరించడంతో కాలనీవాసుల ఆరోగ్యానికి సమస్యలు ఏర్పడుతోంది అన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, కాలనీవాసుల ఆరోగ్య భద్రతకు అవసరమైనచర్యలుచేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చదువుతోనే బంగారు భవిష్యత్తు :

## డిసిపి అధ్యక్షుడు శ్రీహరిరావు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని,విద్యార్థి దశనుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా పట్టు దలతో కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు.మామడ మండలం దిమ్మదుర్తి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విజయ్ కుమార్ రెడ్డి నరేష్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు.విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని,విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు తరగతిగదుల్లోనే నిర్మాణమవుతుందని తెలిపారు.ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ కార్యాక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాఠశాల ఉపాధ్యాయులు మండల పార్టీ అధ్యక్షుడు బూజంగా శ్రీనావాస్ రెడ్డి,మాజీ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి,మాజీ వైస్ ఎపీపీ పడాల శ్రీనివాస్ రెడ్డి,కారిటికల్ మాజీ సర్పంచ్ నల్ల లింగారెడ్డి,మాజీ సర్పంచులు సుంకరి రత్నయ్య,రమణ తదితరులు పాల్గొన్నారు.



# యువకుడి ఆత్మహత్యాయత్నం

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** కోర్టు ఆవరణలో ఆత్మహత్య ప్రయత్నంలో భాగంగా యువకుడు ఒంటిపై కిరోసిన్ పోసుకోగా అక్కడే ఉన్నా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని గౌతంనగర్‌కు చెందిన నర్సింగ్ అనే ఆటో డ్రైవర్ తన తమ్ముడు నుండి డబ్బులు రావల్సిన విషయంలో పోలీసులు పట్టించుకోవటం లేదని మనస్థాపంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. నర్సింగ్ తండ్రి ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి మృతి చెందటంతో కారుణ్య నియామకంలో భాగంగా తన తమ్ముడికి ఉద్యోగం ఇప్పించానని అందుకు ప్రతిఫలంగా తనకు కొంత డబ్బు ఇస్తానని చెక్కు రూపంలో రాసి ఇచ్చాడు. చెక్‌బౌన్స్ కావటంతో ఇద్దరి మధ్య గొడవ జరిగిందని డబ్బుల విషయంలో పోలీసులను ఆశ్రయించగా పట్టించుకోకపోవటంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా నర్సింగ్ హైదరాబాద్ నగరంలోని బేగంబజార్ లో గతంలో రెండు పర్యాయాలు ఇదే విధంగా ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని పోలీసులు వెల్లడించారు. ఇతనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌హెచ్ఓ తెలిపారు.



# రాములోరి తలంబ్రాలు మీ ఇంటివద్దకే డి.ఎం.పండరి..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఎప్రిల్ 6వ తేదీ శ్రీరామ నవమీ రోజు జరుగుతున్న శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలు మీ ఇంటి వద్దకే కేవలం 151 రూ.లు చెల్లింపుతో ఆర్టీసీ కార్గో ద్వారా అం దుకొనే అరుదైన అవకాశాన్ని నిర్మల్ ఆర్టీసీ కలిపిస్తుందని డిపో మేనేజర్ కే.పండరి తెలిపారు.వీలు పడక సమయం దొరకక భద్రాచలం వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని ఆయన తెలిపారు.నిర్మల్ బస్టాండ్ లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయబడిందని 151 చెల్లించి రషీదు పొందాలని శ్రీ సీతారాముల వారి కళ్యాణం అనంతరం మీ ఇంటి వద్దకే తలంబ్రాలు అందిస్తామని డిపోమేనేజర్ తెలిపారు.పలువురు ప్రయాణికులకు రషీదులు ఇప్పించారు.శ్రీసీతారాముల కల్యాణ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్,స్టేషన్ మేనేజర్,ఎ.ఆర్.రెడ్డి కార్గోఎగ్జిక్యూటివ్ కిషొర్ కుమార్,కంట్రోలర్లు పాల్గొన్నారు.

# ట్రస్మా నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పవిత్ర రంజన్ మాసాన్ని పురస్కరించుకుని ట్రస్మా నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో ట్రస్మాలో గల తోటి ముస్లిం సోదర స్కూల్ కరెస్పాండంట్ లకు ఇఫ్తార్ విందు ఇవ్వడం జరిగిందని అన్నా రు.ఈ కార్యక్రమంలో ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్,ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాస్,నిర్మల్ జిల్లా టౌన్ ప్రెసిడెంట్ అయ్యనగారి శ్రీధర్,జిల్లా సెక్రటరీ శ్యామ్ ప్రకాష్,స్టేట్ ఈసి మెంబెర్ షబ్బీర్,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్టులు హేయమైన చర్య




**ప్రజాపక్షం/బోధన్:** రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా ముందస్తు అరెస్టులు చేయడం హేయమైన చర్య అని వామపక్ష పార్టీల నాయకులు వాపోయారు. టియుసిఐ జిల్లా కార్యదర్శి మల్లేష్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి, ఇఫ్టూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు పుట్ట వరదయ్య లను పట్టణ పోలీసులు శనివారం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ముందస్తు అరెస్టు చేయడాన్ని ఖండిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాసన సభ సమావేశాల సందర్భంగా వామపక్ష పార్టీల నేతలను బోధన్ పోలీసులు అరెస్టు చేయడం పట్ల మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : వడగళ్ల వానతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి అన్నారు. ధర్పల్లి మండలం మద్దుల్ తండా, వాడి, గుడి తండా, ధర్పల్లి గ్రామాల్లో శుక్రవారం సాయంత్ర కురిసిన వడగళ్ల వానకు వరి పంటలు మొక్కజొన్న, కూర గాయల పంటలు దెబ్బ తినగా విషయాన్ని తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు మండల నాయ కులతో కలిసి పరిశీలించి రైతులను ఓదార్చారు. కార్యక్రమంలో మహిపాల్, గంగారెడ్డి, మహేష్, గంగాదాస్, నరేష్, శేఖర్, సదానంద్, రాము, మురళిగౌడ్, రాజమల్లు, తిరుపతినాయక్, గోపి, శ్రీను, గోవింద్, శ్రీను, పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : 2024–25 సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లా ఇంటర్ విద్యాధికారితో పాటు పరీక్షల నిర్వహణ కమిటీని శనివారం అభినందించారు. ఈ సందర్భంగా జిలా ఇంటర్ విద్యాధికారి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్ విద్యాధికారి రవికుమార్, పరీక్షల నిర్వహణ కమటీ సభ్యులు చిన్నయ్య, రజియొద్దీన్, అస్లాం, హైపవర్ కమిటీ శ్రీనాథ్ పాల్గొన్నారు.

## వేలంలో తైబజార్ ను దక్కించుకున్న కబీర్ అహ్మద్



ప్రజాపక్షం/బోధన్ః నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని పురపాలక పరిధిలోని తై బజార్ ను మున్సిపల్ అధికారులు వేలంపాట నిర్వహించారు. 2025–26 ఆర్థిక సమాచారం ప్రకారం బోధన్ పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో 32మంది దరఖాస్తులు చేసుకొని వేలం పాటలో పాల్గొనగా మహ్మద్ కబీర్ అహ్మద్, 23లక్షల 45వేలకు పట్టణ తై బజార్ ను వేలం పాటలో దక్కించుకున్నారు. జంతువదశాల వేలం పాటలో వేలం పాట పాడిన అబ్దుల్ అజీజ్ 4లక్షల 52వేలకు జంతువు వదశాల వేలంలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వెంకట నారాయణ, మేనేజర్లు రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శవంతో రాజకీయాలు చేయడం సరికాదు..

### కార్యకర్తలను కలిసి నడుద్దామని చెప్పా..
### కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు



ప్రజాపక్షం / బాన్సువాడ : బీర్కూర్ మండలం దామరంచ గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు ఇక్బాల్ అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని, ఆయన మృతికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కారణమని శవంతో రాజకీయాలు చేయడం సరికాదని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. శనివారం బాన్సువాడ పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారని నియోజకవర్గం అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేతో తాను కలిసి నడుస్తానని, పాత కాంగ్రెస్ కార్యకర్తలను కూడా తనతోపాటు రావాలని ఆహ్వానించినప్పటికి ఇప్పటి వరకు రాలేదన్నారు. తనతోపాటు వచ్చిన పాత కాంగ్రెస్ కార్యకర్తలకు వర్ని మార్కెట్ కమిటి ఛైర్మన్‌గా సురేష్ బాబా, కోటగిరి ఛైర్మన్‌గా గైక్వాడ్ హనుమంతులను నియమించడమే కాకుండా, నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులను పాత కాంగ్రెస్ కార్యకర్తలకు అప్పగించడం జరిగిందన్నారు. ఎంపి సురేస్ షెట్కార్ సహకారంతో రెండు కోట్ల నిధులు రావడం జరిగిందని, గ్రామాలలో అభివృద్ధి కొరకు పనులు చేస్తామని వచ్చే నాయకులకు అందరి సమ్మతితో పనులను అప్పగించడం జరుగుతుందన్నారు. మైనార్టీ నాయకులు ఏక్బాల్ ఏనాడు కాంట్రాక్టర్‌గా పనులు చేయలేదని, ఎంపి 25 లక్షల పనులు ఇటీవలే అప్పగించగా హఠాత్తుగా మరణించడం బాధాకరమని ఆయన మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ నార్ల సురేస్ గుప్తా, పార్టీ అధ్యక్షుడు బోయిని శంకర్, నంద కిషోర్ గుప్తా, నాయకులు హన్మాండ్లు, ఎజాస్, రహీస్, మోసిన్, మోతిలాల్, శ్రీనివాస్ రెడ్డి, బాబా, జీవన్, పర్వారెడ్డి, సతీష్ గౌడ్, కాశిరాం, గౌస్, కుమ్మరి రాజు, జీవన్, లక్ష్మాగౌడ్, పాల్గొన్నారు.

## అక్రమ ఇండ్ల నిర్మాణాలపై మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన బిజెపి నాయకులు



ప్రజాపక్షం/బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలో అక్రమ ఇండ్ల నిర్మాణాలు, భూకబ్జాలు, పదిశాతం బూముల కబ్జాపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతు బిజెపి నాయకులు శనివారం ఇచ్చిన చలో బాన్సువాడ కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలు మునిసిపల్ కార్యాలయానికి ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వెళ్ళి ముట్టడించారు. పోలీసులు మునిసిపల్ కార్యాలయం లోపలికి వెళుతున్న కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ బాన్సువాడ పట్టణంలోని జర్నలిస్టు కాలనీ, పలు కాలనీలలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారన్నారు. బిపిఎల్ కింద పేద వర్గాలకు చెందాల్సిన ఇండ్లను డబ్బులు ఉన్నవారికి వ్యాపారస్తులకు, రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ఇండ్లను కట్టబెట్టారని వారు ఆరోపించారు. పది శాతం భూములలో నిర్మా ణాలు జరుపుతూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, ఖాళీ స్తలాలకు ఇంటి నెంబర్లు వేస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మరోసారి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, నాయకులు శంకర్ గౌడ్, పైడిమల్ లక్ష్మి నారాయణ, కోణాల గంగారెడ్డి, హన్మాండ్లు యాదవ్, సాయికిరణ్, సాయిరెడ్డి, భాస్కర్ రెడ్డి, గోపాల్, దత్తు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బంజపల్లి తైబజార్ వేలం వాయిదా

ప్రజాపక్షం/నిజాంసాగర్ : బంజపల్లి రగామపంచాయతీ పరిధిలోని తైబజార్ వేలంపాటను శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ వేలంపాటలో 2025 –26 సంవత్సరానికి గాను డీఎల్‌పీఓ ఆదేశానుసారం నిర్ణయించిన ధర కంటే తక్కువ పలకడంతో ఈ వేలంపాటను ఈనెల 25వ తేదీ మంగళవారం ఉదయం 11 గం.లకు వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

# బెట్టింగ్ మాఫియా..!



**ఐపీఎల్ మ్యాచ్ ఆన్ లైన్ బెట్టింగ్ జోరు..**
**ఊబిలో జారుతున్న సరిహద్దు ప్రాంత క్రికెట్ అభిమానులు**
**సరిహద్దు ప్రాంత గ్రామాలపై పాగా వేసిన మహారాష్ట్ర మాఫియా..**
**ఆన్లైన్ ద్వారానే లావాదేవీలు..**

ప్రజాపక్షం/నిర్మల్/భైంసా : క్రికెట్ బెట్టింగ్ మాఫియా చాప కింద నీరులా సాగుతోంది.ముఖ్యంగా ఐపీఎల్ సీజన్లో ఎక్కువగా ఉంటోంది.క్రికెట్ బుకీలు ఏకంగా తిష్ట వేసి క్రీడాభిమానులను ఈ రొంపిలోకి దింపి సొమ్ములు చేసుకుంటున్నారు.క్రికెట్ పిచ్చి ఉన్న పలువురు.ఈ ఊబిలోకి దిగి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.ఐపీఎల్ సీజన్ వచ్చిందంటే చాలు యువత మ్యాచ్లను తిలకించేందుకు ఎంతో ఉత్సాహం చూపుతుంటారు.అదే సమయంలో వారి ఉత్సాహాన్ని సోమ్ము చేసుకోవడానికి బుకీలు రంగంలోకి దిగుతుంటారు.క్రికెట్ అంటే అభిమాన మా..మీ పేవరేట్ టీమ్ గెలుస్తుందనే నమ్మకం మీకుందా..నిజంగా ఉంటే బెట్టింగ్ కట్టచ్చు కదా..సరదా తీరుతుంది.డబ్బులు గెలుచుకోవచ్చు.. అంటూ వారిని చిన్నగా ఊబిలోకి దించుతున్నారు.భైంసా నియోజకవర్గంలోని సరిహద్దు ప్రాంత మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో ఈ వ్యవహారం గుట్టుగా సాగుతుంది బెట్టింగ్ అంతా దాదాపు ఫోన్లోనే జరుగుతుంది.తీరు వర్గాలు ఫోన్లో కాంటాక్ట్ చేసి బెట్టింగ్ కాస్తారు గెలిచిన వారి నుంచి కమిషన్ పొందుతారు.సరిహద్దు ప్రాంతంలోని మహారాష్ట్ర నాందేడ్,బ్రోకర్,దేగ్లూర్ పట్టణాలకు చెందిన మాఫియా పల్లెల్లోని యువకులకు టార్గెట్ చేస్తున్నారు.క్రికెట్ బెట్టింగ్ కారణంగా ఎంతోమంది అప్పుల పాలైన సంఘటనలు లేకపోలేదు మరి కొందరు పీకల్లో తూ అప్పుల పాలై జీవితాలు నాశనం చేసుకుంపటన్నారు.ఫోన్లోనే మంతనాలు బెట్టింగ్ వ్యవహారం మొత్తం ఫోన్లోనే సాగుతోంది.చాలాచోట్ల ఎస్...నో..ఓకే..డన్.ఈటింగ్ వంటి కోడ్ లాంగ్వేజీని దీనికోసం వాడుతుంటారు.క్రికెట్పై పెద్దగా పరిజ్ఞానం లేకున్నా ఆడుతుంది.గెలుస్తుంది..ఓడుతుంది అనే సూత్రాలతో పందేలు కాస్తుంటారు.చాలా మంది టీవీలు చూస్తూనే పందేలు కడుతుంటారు.గ్రౌండ్లో చూసే ఆటకు,టీవీల్లో చూసే వారికి మూడు బంతుల సమయం తేడా ఉంటుంది.బంతి బంతికి ఆట ఎలా ఉంటుందో ముందే తెలుసుకొని బెట్టింగ్ కాసేవారి జేబులను బుకీలు గుల్ల చేస్తున్నారు.మ్యాచ్ ఎవరు గెలుస్తారో..?ఎవరు ఓడిపతారో అనే కాకుండా ఎవరు ఎన్ని పరుగుతు చేస్తారు..ఈ ఓవర్లో ఎన్ని పరుగులు వస్తాయనే కోణంలోనూ పందాలు కాస్తారు.ఆన్లైన్ బెట్టింగ్ ఇలా ఆండ్రాయిడ్ ఫోన్లో క్రికెట్ బెట్టింగ్ చేసేవారు కొన్ని యాప్లను డౌన్లోడ్ చేసుకుంటున్నారు.ఆ తరువాత మ్యాచ్ను ప్రత్యక్షంగానూ పరిశీలిస్తూ పందేలు కాస్తారు.మ్యాచ్ చూసేందుకు ఒక మొబైల్,బెట్టింగ్ కాసేందుకు మరో మొబైల్ వినియోగించి ఆన్లైన్లో క్రికెట్ బుకీలు సంప్రదింపులు జరుపుతుంటారు.బార్లు,ఇళ్ల మధ్య స్థావరాలు,క్రికెట్ గ్రౌండ్లు ఏర్పాటు చేసుకొని వ్యవహారాన్ని చక్క బెట్టుకొంటున్నారు.ప్రతిబాల్కో రేటు టాప్ వేసే సమయం నుంచి బ్యాటంగ్ ఎవరు ఎంచుకొంటారు.బౌలింగ్ ఎవరు చేస్తారు.నుంచి బెట్టింగ్ ప్రారంభమవుతుంది.ఏ ఆటగాడు ఎన్ని పరుగులు చేస్తారు.బాల్కు ఎన్ని పరుగులు వస్తాయి.ఎవరు గెలుస్తారు.ఎన్ని పరుగు లతో మ్యాచ్ పూర్తవుతుంది.ఇలా ప్రతిదానికీ ఒక పందెం ఉంటుంది.మొదలైన జోరు గ్రామాల్లో బెట్టింగ్ జోరు అప్పుడే మొదలైంది.నేటి నుంచి ఐపీఎల్ 2025 క్రికెట్ మ్యాచ్లు ప్రారంభమమై మేనెల 25వ తేదీన ముగుస్తాయి.ఇందులో బెట్టింగ్ జోరు అప్పుడే ఊపందుకుంది.ఎక్కువగా చెన్నై,బెంగుళూరు,హైదరాబాద్,ముంబయి టీమ్లపై యువకులు బెట్టింగ్లు,కాసున్నారు.సరిహదు ప్రాంతం గ్రామాలపై పాగావేసిన మహారాష్ట్ర మాఫియా సరిహద్దు ప్రాంతంలోని గ్రామాలలో మహారాష్ట్ర ఏజెంట్లు పాగా వేశారు.వీళ్ళు బెట్టింగ్ కాసే వారికి మధ్యవర్తిగా వ్యవహరించి గెలిచిన వారి దగ్గర వేలల్లో కమిషన్లు తీసుకుంటారు.గత కొన్ని సంవత్సరాలుగా మహారాష్ట్ర గ్యాంగ్ పాగా వేసి బెట్టింగ్ అనే వ్యసనంలో యువకులకు దించివాళ్ళ కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్నాయి పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ మాఫియాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.